సాక్షి
కర్నూలు
బుధవారం ॥ 7 ॥ ఫిబ్రవరి ॥ 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కంచర్ల సత్యనారాయణ మంగళవారం రూ.1,01,116 విరాళాన్ని అందించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం హైదరాబాద్‌కు చెందిన మానస స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీలో నంద్యాల జిల్లాకు మొదటి స్థానం

● ఐదో స్థానంలో కర్నూలు జిల్లా

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముగిసింది. ఫిబ్రవరి నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం 5వ తేదీ రాత్రి 12 గంటల వరకు కొనసాగింది. పింఛన్ల పంపిణీలో నంద్యాల జిల్లాకు రాష్ట్రంలోనే మొదటి స్థానం లభించగా.. కర్నూలు జిల్లా 5వ స్థానంలో నిలిచింది. మొత్తం రూ.141.02 కోట్లు విడుదల చేయగా రూ.140.04 కోట్లు పంపిణీ చేయడం విశేషం.

☛ కర్నూలు జిల్లాలో 2,48,240 పింఛన్లకు ప్రభుత్వం రూ.74.33 కోట్లు విడుదల చేసింది. ఇందులో 2,46,512 పింఛన్లకు రూ.73.81 కోట్లు పంపిణీ చేశారు. 99.29 శాతం పంపిణీ పూర్తయింది.

☛ నంద్యాల జిల్లాలో 2,24,398 పింఛన్లకు ప్రభుత్వం రూ.66.69 కోట్లు విడుదల చేసింది. ఇందులో 2,22,885 పింఛన్లకు రూ.66.23 కోట్లు పంపిణీ చేశారు. 99.31 శాతం పంపిణీ పూర్తయింది.

ఆర్‌యూ బీఈడీ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబర్‌లో నిర్వహించిన బీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.నరసింహులు తెలిపారు. ఫలితాలు https//rayalaseemauniversity.ac.in/వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 2,827 మంది పరీక్షలు రాయగా 1,477 మంది, సప్లిమెంటరీ పరీక్షలను 813 మంది రాయగా 357 మంది ఉత్తీర్ణులు అయ్యారన్నారు.

రైతులకు సూచనలు ఇవ్వండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటల సాగులో రైతులకు సలహాలు ఇచ్చి సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన మిడ్ టర్మ్ పరీక్షను ఆమె పరిశీలించారు. దేశీ డిప్లమా కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఆత్మ డీపీడీ శ్రీలత మాట్లాడుతూ శ్రీవరి సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దేశీ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర పాల్గొన్నారు.

నంద్యాల రైల్వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సుధారాణి

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లాలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనుల పర్యవేక్షణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.సుధారాణిని నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల–గిద్దలూరు మధ్యలో జరిగే రైల్వే డబ్లింగ్ పనులు, కొత్త బ్రాడ్ గేజ్ లైన్ నిర్మాణం కోసం చేపట్టే భూసేకరణ పనులను పర్యవేక్షించనున్నారు.

మృత్యువు ఓడిపోయింది!

ఆరుగురి జీవితాల్లో వెలుగులు

- మూడేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త మృతి
- తాజాగా భార్యకు బ్రెయిన్‌డెడ్
- అవయవ దానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు
- ఆరుగురి జీవితాల్లో వెలుగులు
- గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాల తరలింపు
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోనే విజయవంతంగా ఆపరేషన్
- ఓ రోగికి ఇక్కడే కిడ్నీ దానం



గ్రీన్ ఛానల్‌లో అవయవాలను తరలిస్తున్న దృశ్యం

మంగళవారం సాయంత్రం 5.30 గంటల సమయం. రద్దీ ప్రాంతమైన కర్నూలు ప్రభుత్వాసుపత్రి సర్కిల్‌లో ట్రాఫిక్ ఒక్కసారిగా స్తంభించింది. కలెక్టరేట్ ముందు నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు, గాయత్రి ఎస్టేట్ మీదుగా గుత్తి పెట్రోల్ బంకు వరకు వన్‌వే ఏర్పాటైంది. సుమారు అరగంట పాటు ఇదే పరిస్థితి. ఏం జరుగుతుందో తెలియదు.. ఎవరైనా ప్రముఖులు నగర పర్యటనకు వచ్చారేమోనని అందరూ భావించారు. ఆనోటా ఈనోటా ఇదంతా గ్రీన్ ఛానల్ ఏర్పాటులో భాగంగా తీసుకున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలుగా తెలుసుకున్నారు. ఓ మహిళ చనిపోగా.. మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆమె అవయవాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో సేకరించి అప్పటికప్పుడు ఆయా ఆసుపత్రులకు అగమేఘాలపై తరలిస్తున్నట్లు తెలుసుకొని ప్రతి ఒక్కరూ చేతులెత్తి మొక్కి మనసులోనే అభినందించారు.



బ్రెయిన్‌డెడ్‌కు గురై చికిత్స పొందుతున్న పావనీలత (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన పావనీలత(27)కు ఆరేళ్ల క్రితం తెలంగాణలోని కొల్లాపూర్ జిల్లా సింగోటం ప్రాంతంలోని నరసాపురం పల్లెకు చెందిన శ్రీనివాసరెడ్డితో వివాహమైంది. వీరికి ఐదేళ్ల జ్యోత్స్న సంతానం. శ్రీనివాసరెడ్డి స్థానికంగా లెక్చరర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవారు. మూడేళ్ల క్రితం ఆయనకు కిడ్నీలు ఫెయిల్ కావడంతో డయాలసిస్ చేయించారు. అయితే కోలుకోలేక మరణించారు. అప్పటి నుంచి కుటుంబ పోషణలో భాగంగా పావనీలత ఉద్యోగ అన్వేషణలో ఉంది. ఈ క్రమంలోనే ఈ నెల 2న హైదరాబాద్‌కు స్నేహితుల వద్దకు ఉద్యోగం కోసం వెళ్లింది. అక్కడే ఆమెకు ఫిట్స్(మూర్ఛ) రావడంతో కింద పడిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికంగా ఆమెకు చికిత్స చేయించారు. మెదడు తీవ్రంగా దెబ్బతిందని వైద్యులు చెప్పడంతో అక్కడ ఖర్చు భరించలేక కుటుంబసభ్యులు అదే రోజు రాత్రి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. తన కుమార్తె ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ఆమె తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందారు. కొద్దిసేపటికి తేరుకుని ఆమె అవయవాలను దానం చేసేందుకు నిర్ణయించుకున్నారు. తమ కుమార్తెను ఎలాగూ కోల్పోయామని, ఆమె అవయవాలను మరికొందరికి దానం చేయడం ద్వారా వారి కుటుంబాల్లో సంతోషాలు నింపేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు వైద్యులు, ఆసుపత్రి అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సోమవారం జీవనధాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారి సీనియారిటీ ప్రకారం అవయవాలను కేటాయించేందుకు చర్యలు చేపట్టారు.

గ్రీన్‌ఛానల్ ద్వారా అవయవాల తరలింపు

పావనీలత నుంచి సేకరించిన అవయవాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాల మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా తరలించారు. ఈ మేరకు కర్నూలు నగరంతో పాటు హైదరాబాద్, విజయవాడ రహదారుల్లో పోలీసులు ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. అంబులెన్స్‌లు వెళ్లేందుకు వాహనాలు ఏవీ అడ్డురాకుండా చర్యలు తీసుకున్నారు. కాలేయాన్ని విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి, ఊపిరితిత్తులను



కర్నూలు ప్రభుత్వాసుపత్రి నుంచి పావనీలత ఊపిరితిత్తులను హైదరాబాద్‌కు తరలిస్తుండగా స్వయంగా పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌కు, ఒక కిడ్నీని కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు, మరో కిడ్నీని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కేటాయించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే ఓ వ్యక్తికి ఈ కిడ్నీని అమర్చారు. ముందుగా గుండెను సైతం సేకరించి తరలించాలని వైద్యులు భావించినా చెన్నై నుంచి అనుమతి రాలేదు. గుండెను తీసిన తర్వాత ఐదు గంటల్లో అక్కడికి తరలించడం సాధ్యం కాదని



ప్రభుత్వాసుపత్రిలోనే ఓ రోగికి అమర్చేందుకు తరలిస్తున్న కిడ్నీ

భావించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అయితే నేత్రదానంలో భాగంగా కంటి కార్నియాలను సేకరించారు. మొత్తంగా అవయవదానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపడంతో మృత్యువు ఓడిపోయినట్లయింది.

అనాథగా మారిన చిన్నారి జ్యోత్స్న

మూడేళ్ల క్రితం తండ్రి, ఇప్పుడు తల్లి మరణించడంతో కుమార్తె జ్యోత్స్న(5) అనాథగా మారింది. పావనీలత తండ్రి ప్రతాపరెడ్డి బోర్‌వెల్ మోటార్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. రెండో కుమార్తె పావనీలత కన్నుమూసింది. ఆమె కుమార్తె జ్యోత్స్నను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదుకోవాలని కుటుంబసభ్యులు మంగళవారం వేడుకున్నారు.



కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రికి కిడ్నీ తరలింపు

వైద్యులను అభినందించిన జిల్లా కలెక్టర్

ప్రభుత్వాసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి అవయవాలను సేకరించి అవయవదానం చేయడం ఇదే మొదటిసారని, ఈ ఆపరేషన్ విజయవంతం చేసిన వైద్యులు అభినందనీయులని జిల్లా కలెక్టర్



ఊపిరితిత్తులతో హైదరాబాద్‌కు తరలుతున్న అంబులెన్స్

డాక్టర్ సృజన అన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె ప్రభుత్వాసుపత్రిలో అవయవాల తరలింపును దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో చాలా మంది అనారోగ్యంతో బాధపడుతూ అవయవాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇలాంటి వారికి బ్రెయిన్ డెడ్ అయిన రోగుల నుంచి అవయవాలను సేకరించి అమర్చడం ద్వారా మరికొందరికి ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. జీవన్‌దాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారి అవసరం మేరకు పావనీలతకు సంబంధించిన అవయవాలను ఆయా ప్రాంతాలకు పంపించామన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిష్ణాతులైన వైద్యుల సహాయంతో, ఖరీదైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని పావనీలతకు చెందిన కొన్ని అవయవాలను పోలీస్ వారి సహాయంతో గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసుకుని హైదరాబాద్, విజయవాడ, కర్నూలు ఆసుపత్రులకు తరలించామన్నారు. అవయవదానానికి ముందుకొచ్చిన పావనీలత తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అవయవదానం ఏర్పాట్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. మానవ శరీరంలోని అవయవాలను దాదాపు ఎనిమిది మందికి ఉపయోగించుకోవచ్చని, వీటిలో చిన్నపేగులు, పెద్దపేగులు, క్లోమం, ఇతర భాగాలు కూడా ఉపయోగపడతాయన్నారు. భారత దేశంలో కొంత మంది మూఢనమ్మకాల వల్ల అవయవదానం చేయలేకపోతున్నారని.. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ విషయమై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆరోగ్యవంతులుగా చేయడానికి ప్రతి ఒక్కరూ దాతగా మారి మళ్లీ జీవించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కేజీ.గోవిందరెడ్డి పాల్గొన్నారు.



శోక సంద్రంలో పావనీలత కుటుంబ సభ్యులు, కుమార్తె జ్యోత్స్న

ప్రతి విద్యార్థికీ ఆల్‌బెండజోల్ మాత్రలు

● ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు సిటీ: నులిపురుగుల నివారణకు ప్రతి విద్యార్థికి ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కేజీబీవీలతో పాటు ప్రతి మేనేజ్‌మెంట్ పాఠశాలలన్నీ ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. ప్రీస్కూల్ ఏజ్ నుంచి కళాశాల స్థాయి విద్యార్థుల మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అందుకు విద్యాశాఖ డివిజన్, మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, స్పెషల్ ఆఫీసర్లు వైద్య అధికారులతో సమన్వయం చేసుకుని మాత్రలను విద్యా సంస్థలకు తెప్పించుకుని ప్రతి విద్యార్థికి అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల్లో ఉదయం ప్రార్థన సమయాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

తాగునీటి పథకాలకు రూ.15 కోట్లు

కర్నూలు (టౌన్): కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ పరిధిలో తాగునీటి పథకాలను నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 15 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ మంగళవారం సాయంత్రం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీ లక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో నగరంలో మరో 5 ఉపరితల రిజర్వాయర్లను నిర్మించనున్నారు. నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా శివారు కాలనీలకు తాగునీటిని అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయి తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- 9 లోపు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయండి
- తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్‌జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లాఎన్నికల అధికారి/కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్, కులగణన సర్వే తదితర అంశాలపై ఆమె రిటర్నింగ్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో జేసీ నారపురెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓల పాత్ర కీలకమన్నారు. ఈక్రమంలో త్వరగా మండలాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వచ్చే 10–15 రోజుల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదిక పంపాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, బీఎల్‌ఓలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఎన్నికల అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల పనులతోపాటు ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై కూడా దృష్టి సారించాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది మీద ఆధారపడకుండా రిటర్నింగ్ అధికారి హ్యాండ్‌బుక్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఇతర నియమాలను తప్పనిసరిగా చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లతో మాట్లాడుకొని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి చేరేందుకు అవసరమైన రూట్‌మ్యాప్‌లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమీక్షలు చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కులగణన సర్వే 88 శాతం పూర్తి

జిల్లాలో కులగణన సర్వే 88 శాతం పూర్తయిందని, బుధవారంలోపు 90 శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను కలెక్టర్ సృజన ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సర్వేను వేగవంతం చేయించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా టాప్‌లో ఉందన్నారు. కానీ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించడంలో మాత్రం జిల్లా దిగువ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. బుధవారంలోపు ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్‌లో పురోగతి సాధించేలా చూడాలన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంపులకు సంబంధించి వలంటీర్లతో సర్వేను వేగవంతం చేయించాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇచ్చిన స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 9వ తేదీలోపు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ శివ నారాయణ్ శర్మ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పేరుతో పైసా వసూల్!

- ఈనెల 5 నుంచి మొదలైన ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్
- పరీక్షల పేరుతో విద్యార్థుల నుంచి అదనంగా వసూలు
- మామూళ్ల మత్తులో ప్రాంతీయ బోర్డు అధికారులు
- అనుమతులు ఒక చోట..కాలేజీలు, పరీక్షలు మరోచోట
- అవాక్కైన డీఈసీ సభ్యులు

ఒకేషనల్ ప్రాక్టికల్స్.. కళాశాలలకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఈజీగా పాస్ చేస్తామని కొందరు, ఎక్కువ మార్కులు వేస్తామని మరికొందరు కళాశాలల యాజమాన్యాలు పేద విద్యార్థుల నుంచి వసూళ్లకు తెరలేపారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.1,500 నుంచి రూ.2,500 దాకా వసూలు చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. మరో విషయమేమిటంటే కొన్ని కళాశాలలు ఉండాల్సిన చోట కాకుండా మరో చోట తరగతులు నిర్వహిస్తూ డీఈసీ కమిటీనే మస్కా కొట్టిస్తున్నారు.

కర్నూలు సిటీ:ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ ఈ నెల 5 నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన ఒకేషనల్ జూనియర్ కాలేజీలు 40 దాకా ఉన్నాయి. ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు 25 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి స్పెల్ పరీక్షలు ఈ నెల 5 నుంచి 16 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి.

అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదుతో వెలుగులోకి..

మంగళవారం ఒకేషనల్ పరీక్షలు ప్రారంభమైన కొద్దిసేపటికే గాయత్రీ ఎస్టేట్‌లోని ఓ కాలేజీ వద్ద నుంచి అజ్ఞాత వ్యక్తి ఫోన్ ద్వారా ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.1,500 నుంచి రూ.2,500 వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని చెప్పడంతో ఓ అధికారి హుటాహుటిన అక్కడికి వెళ్లి విచారించారు. నిజమని తేలడంతో రూ.50 వేలకు బేరం కుదుర్చుకుని వాటాలుగా పంచుకుని, నోటీస్ ఇచ్చి అక్కడి నుంచి జారుకున్నట్లు సమాచారం.

దాదాపు అన్ని కళాశాలలదీ అదే దారి..

జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేట్ ఒకేషనల్ కాలేజీలదీ అదే దారి. ప్రాక్టికల్ పరీక్షల ఖర్చుల పేరుతో ప్రతి కాలేజీ యాజమాన్యం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసి ప్రాంతీయ బోర్డు అధికారులకు ముట్టజెప్పి ఆ తర్వాత ప్రతి విద్యార్థి నుంచి యామజాన్యాలు వసూళ్లకు తెరలేపుతున్నాయనే ఆరోపణలున్నాయి. పరీక్షల తనిఖీలకు వెళ్లే వారిని సైతం ఓ అధికారి ముందుగానే తనకు అనుకూలంగా, తన మాట వినేవారినే ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది.

అడ్రస్ గల్లంతు

కొన్ని కళాశాలలకు యాజమాన్యాలు ఒక చోట చిరునామాతో అనుమతులు తెచ్చుకుని మరోచోట తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం సోమవారం తనిఖీలకు వెళ్లిన డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ(డీఈసీ) సభ్యులకు అనుభవ పూర్వకంగా తెలిసింది. ఉదయం నగరంలోని మూడు కళాశాలలను తనిఖీ చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా కృష్ణవేణి, జేపీ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం భూపాల్ కాంపెక్ట్ చిరునామాతో ఉన్న ఎస్‌వీఈఎస్ కళాశాలకు వెళ్లేందుకు సిద్ధం కాగా అక్కడ లేదని తెలుసుకుని అవాక్కయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించగా నన్నూరు వద్ద ఉందని చెప్పడంతో అడ్రస్ ఒక చోట.. కళాశాల ఒక చోట ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించడంతో ఆయన నీళ్లు నమిలినట్లు సమాచారం. అలాగే నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ సమీపంలో ఉండాల్సిన (సెంటర్ కోడ్.10004) నేషనల్ ఒకేషనల్ జూనియర్ కాలేజీని కూడా దాదాపు మూడేళ్లుగా ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్నా అధికారులకు తెలిసి కూడా పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలల నిర్వహణే ఇంత లోపభూయిష్టంగా ఉంటే అందులో పాఠాలు ఎవరితో చెప్పిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



జరిమానా విధించాం

విద్యార్థుల నుంచి గాయత్రీ కాలేజీ యాజమాన్యం రూ.2,400 వసూలు చేసినట్లు ఫిర్యాదు రావడంతో విచారించి, రూ.5 లక్షలు జరిమానా వేసి కమిషనర్‌కు పంపించాం. మరో రెండు ఒకేషనల్ కాలేజీలు షిఫ్టింగ్ విషయమై నోటీసులు ఇచ్చి, జరిమానాలు వేయగా కొంత సొమ్ము చెల్లించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎక్కడా అవకతవకలు లేవు. ఒక వేళ ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గురువయ్య శెట్టి, ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం అధికారి

నేడు శ్రీశైలం ప్రాజెక్ట్‌కు కేంద్ర బృందం

నంద్యాల(సెంట్రల్):నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), కేఆర్‌ఎంబీ (కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్) అధికారుల బృందం నిమిత్తం బుధవారం శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సందర్శించనుంది. ఎన్‌డీఎస్‌ఏ సభ్యుడు వివేక్ త్రిపాఠి నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో పాటు, జాతీయ జల సంఘం, కేఆర్‌ఎంబీ, సీఎస్ఎంఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఎనిమిది మంది సభ్యుల బృందం రెండు రోజుల పాటు ప్రాజెక్ట్‌ను పరిశీలించనుంది. గత నెల 9వ తేదీన జల శక్తి శాఖ కార్యదర్శి ఏపీ, తెలంగాణ అధికారులతో సమావేశమై తీసుకున్న నిర్ణయాల అమలులో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. ప్రాజెక్టు దిగువ భాగంలో రక్షణ చర్యలతో పాటు, అత్యవసర మరమ్మతుల కోసం రూ.800 కోట్లు అవసరమని ఇప్పటికే కేఆర్‌ఎంబీ అంచనా వేసింది.అధికారుల సందర్శనలో వీటిపై ఓ అంచనాకు వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

భక్తులకు నిజబృందావన దర్శనం



రాఘవేంద్ర స్వామి మూలబృందావనం

మంత్రాలయం: పవిత్ర ఏకాదశి సందర్భంగా భక్తులకు రాఘవేంద్రుల నిజబృందావన దర్శనం కలిగింది. ఆనవాయితీలో భాగంగా మంగళవారం ఏకాదశిని పురస్కరించుకుని బృందావనానికి అర్చకులు తులసీ మాలధారణ చేసి నిత్య పూజలకు స్వస్తి పలికారు. అర్చకులు, భక్తులు, ఏకాదశి రోజున ఉపవాస దీక్షలు కొనసాగారు. నిజ బృందావనం దర్శించుకుని భక్తులు ఆధ్యాత్మికతతో గడిపారు.

అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): ఈనెల 1న చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా కలర్ గ్రానైట్ తరలిస్తూ పట్టుబడిని లారీ యజమాని నుంచి రూ.3.33 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. అపరాధ రుసుం చెల్లించడంతో మంగళవారం లారీని రిలీజ్ చేశామన్నారు.

వివాహిత ఆత్మహత్య

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వరమ్మ(30) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె స్వగ్రామం డోన్ మండలం అబ్బిరెడ్డిపల్లె. 9 ఏళ్ల క్రితం బింగిదొడ్డికి చెందిన సురేంద్రతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సమస్యలతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా, ఏమైనా కారణాలున్నాయా అనేది విచారణలో తెలుస్తుందని వెల్దుర్తి పోలీసులు తెలిపారు.

కర్నూలు డీఈఓగా కె. శామ్యూల్



కర్నూలు (సిటీ): ఏపీ మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. శామ్యూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారిగా నియమిస్తూ మంగళవారం పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీఈఓగా పనిచేస్తున్న డాక్టర్ రంగారెడ్డి జనవరి 31వ తేదీన పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఈయనను నియమించారు. అదే విధంగా నంద్యాల డీఈఓ ఆఫీసులో ఏడీగా పనిచేస్తున్న అనురాధను వైఎస్ఆర్ జిల్లా డీఈఓగా నియమించారు. వైఎస్ఆర్ జిల్లా డీఈఓ వై. రాఘవరెడ్డికి ఆర్‌జేడీ (కడప)గా పదోన్నతి కల్పించారు.

బ్యాంకు ఖాతాలపై నిఘా!

- నగదు వివరాలను సేకరించిన ఎన్నికల కమిషన్
- ఇప్పటికే రంగంలోకి దిగిన ఆదాయ పన్ను శాఖ
- రూ.10లక్షలు, ఆపై లావాదేవీలపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే డబ్బు మూటలతో సిద్ధమైన టీడీపీ
- సంక్షేమం, అభివృద్ధినే నమ్ముకున్న వైఎస్సార్‌సీపీ



కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల షెడ్యూలుకు ముందే అక్రమాలను అరికట్టేదిశగా ఎన్నికల కమిషన్ చర్యలు చేపడుతోంది. ఇదే సమయంలో ఆదాయపు పన్నుశాఖ కూడా బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ విడత ఎన్నికల్లో హైటెక్ తరహాలో నగదు బదిలీ జరగవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బ్యాంకు ఖాతాలపై ఎన్నికల కమిషన్ ఆరా తీస్తున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఎన్నికల్లో ప్రధానంగా తెలుగుదేశం పార్టీ ఓటర్లను గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రలోభాలకు గురి చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే టీడీపీ నాయకత్వం జిల్లాలు, నియోజకవర్గాలకు డబ్బు సంచులు చేర్చినట్లు చర్చ జరుగుతోంది. నగదు సరఫరాను అరికట్టేందుకు ఎన్నికల కమిషన్ ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రధానంగా రూ.10 లక్షలు, ఆపై నగదు లావాదేవీలపై ఎన్నికల కమిషన్‌తో పాటు ఆదాయపు పన్ను శాఖ దృష్టి సారించాయి. ఇప్పటికి రిజర్వు బ్యాంకు ద్వారా ఎన్నికల కమిషన్ అన్ని బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించినట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితమే ఆయా బ్యాంకు ఖాతాల వివరాలను రాష్ట్ర స్థాయి కంట్రోలింగ్ ఆఫీసర్లకు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 లక్షల ఖాతాలు

కర్నూలు జిల్లాలో 27 బ్యాంకులు ఉండగా.. 277 శాఖలు(బ్రాంచీలు). నంద్యాల జిల్లాలో 27 బ్యాంకులు ఉండగా 237 బ్రాంచీలు నిర్వహిస్తున్నారు. ఇక బ్యాంకు ఖాతాలు దాదాపు 60 లక్షలకు పైనే. ఇందులో జన్‌ధన్ ఖాతాలు 7.50 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. అయితే గత మూడు, నాలుగు నెలలుగా పలు బ్యాంకుల్లో ఖాతాలు భారీగా తెరుస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ప్రధానంగా ప్రతిపక్ష టీడీపీ ఎన్నికల సమయంలో ఓటర్లు, పార్టీ నేతలకు నగదు బదిలీ చేసి ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోని గత టీడీడీ ప్రభుత్వం ఎన్నికల ముంగిట మహిళా ఓటర్లకు పసుపు–కుంకుమ పేరుతో డబ్బును అధికారికంగానే పంపిణీ చేసింది. ప్రస్తుతం కూడా ఎన్నికల్లో ఏదోవిధంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రమాదం కనిపిస్తోంది. ఇందులో భాగంగానే ఎన్నికల కమిషన్ బ్యాంకు ఖాతాలపై దృష్టి సారించినట్లు సమాచారం.

ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయనే..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత నగదు తరలించడానికి ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో ప్రతిపక్ష టీడీపీ ఇప్పటికే డబ్బు సంచులను సురక్షితమైన ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. ఎవరికీ అనుమానం రాకుండా సన్నిహితులు, అనుచరుల ద్వారా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. టీడీపీకి రానున్న ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. ఈ ఎన్నికల్లో ఓడితే టీడీపీ గల్లంతు అయినట్లేనన్న భయం ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. అందువల్లే కనీవినీ ఎరుగని రీతిలో ప్రలోభాలకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆర్‌బీఐ ద్వారా జిల్లాల వారీగా అన్ని బ్యాంకులకు చెందిన ఖాతాలు, ప్రస్తుతం వాటిల్లో నగదు వివరాలను సేకరించిటన్లు తెలిసింది. వివిధ కారణాలతో 50 శాతం జన్‌ధన్ ఖాతాలు, 20 నుంచి 30 శాతం జనరల్ ఖాతాలు వినియోగంలో లేవు. ఇలాంటి ఖాతాలను ఎన్నికల వేళ వినియోగించుకునే అవకాశం ఉన్నట్లు ఎన్నికల యంత్రాంగం భావిస్తోంది.

సంక్షేమం, అభివృద్ధే వైఎస్ఆర్‌సీపీ గెలుపునకు సోపానాలు

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతోంది. అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 57 నెలల్లో 124 సార్లు బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు బదిలీ చేశారు. ఇదే సమయంలో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేశారు. రాష్ట్రం మొత్తం మీద దాదాపు 2.50 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికే దక్కింది. దీంతో జగన్ చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో కనిపిస్తోంది. అందుకే కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని కోరుతుండటం విశేషం.

కుంటలకు ఎల్ఎల్‌సీ నీరు విడుదల



ఎల్ఎల్‌సీ నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

కోడుమూరు రూరల్: రానున్న వేసవి దృష్ట్యా కోడుమూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 30 క్యూసెక్కుల నీటిని వర్కూరు శుద్ధవాగు మీదుగా కోడుమూరు హంద్రీ నదిలోకి విడుదల చేస్తుండగా, మరోవైపు ఎల్ఎల్‌సీ నుంచి గూడూరు మండలంలోని గుడిపాడు కుంటకు, కోడుమూరు మండలంలోని కొత్తూరు కుంటకు 30 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. కుంటలను పూర్తి స్థాయిలో నింపడంతో పాటు, ఆయా గ్రామాల్లో బోర్లు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కోడుమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మంగళవారం తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత



అక్రమ మద్యాన్ని సీజ్ చేసిన సెబ్ పోలీసులు



స్వాధీనం చేసుకున్న మద్యం వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్‌రావు

కర్నూలు: సెబ్ దాడుల్లో భారీగా తెలంగాణ మద్యం, నాటుసారా పట్టుబడింది. కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో డీటీఎఫ్, సెబ్ స్టేషన్, పంచలింగాల చెక్‌పోస్టు సిబ్బంది కలసి పంచలింగాల, మీదివేముల, బస్తిపాడు, సల్కాపురం గ్రామాల్లో విస్తృత సోదాలు జరిపి 105 తెలంగాణ మద్యం బాటిళ్లు, 8 బాటిళ్ల బీర్లు, 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ నుంచి తీసుకువచ్చి గ్రామాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం అందడంతో డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, కర్నూలు సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు వీరస్వామి, రెహనా బేగం, మారుతి ప్రసాద్ తదితరులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బోయ హనుమన్న, తలారి లక్ష్మన్నల దగ్గర తెలంగాణ మద్యం, బోయ సోమేశ్వరి దగ్గర నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కడపకు చెందిన హుసేన్‌రెడ్డి బస్సులో బీరు బాటిల్ తీసుకువెళ్తుండగా తనిఖీ చేసి అతన్ని కూడా అరెస్టు చేశారు. మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని టూరిస్ట్ బస్టాండు సమీపంలో మంగళవారం తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రసాద్‌రావు, ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. దేవదాయచట్ట ప్రకారం క్షేత్రంలో మద్యం, మాంసాహారం నిషేధించినప్పటికీ కొందరు వ్యక్తులు అక్రమంగా తెలంగాణ మద్యాన్ని తరలించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు.

ఈ మేరకు క్షేత్ర పరిధిలో పలు చోట్ల తనిఖీలు చేయగా టూరిస్ట్ బస్టాండు సమీపంలో తెలంగాణ రాష్ట్రం మన్ననూరు గ్రామానికి చెందిన విజ్జిబాయి అక్రమంగా నిల్వ ఉంచిన 166 తెలంగాణ క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. విజ్జిబాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

టీడీపీని ఓడించేందుకు మహిళలు సిద్ధం



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శశికళా రెడ్డి తదితరులు

కర్నూలు(టౌన్): రాష్ట్రంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు మహిళలకు ఒక్క మంచి పథకం అమలు చేయలేకపోయాడని, టీడీపీని ఓడించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శశికళారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 11న అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగనన్న నాయకత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిద్ధం సభకు సంబంధించిన పోస్టర్లను ఆమెతో పాటు పార్టీ మహిళా నాయకురాళ్లు ఆవిష్కరించారు. మహిళల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో 33 లక్షల మంది అక్కాచెల్లెమ్మలకు వారిపేరు మీద ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మళ్లీ జగనన్నకే రాష్ట్ర ప్రజలు పట్టం కట్టబోతున్నారన్నారు. వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన పవన్ కళ్యాణ్‌ను వెంట పెట్టుకొని పొత్తులకు వెళ్తున్నాడన్నారు. రాష్ట్రంలో మహిళల ఆశీస్సులు జగనన్నకు మెండుగా ఉన్నాయన్నారు. 25 ఎంపీ సీట్లు, 175 అసెంబ్లీ సీట్ల గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సిద్ధం సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఓటమి తప్పదని తెలియడంతోనే షర్మిలను చంద్రబాబు ఎన్నికల్లో పావుగా వాడుకుంటున్నాడన్నారు. జగనన్నను విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. తెలంగాణ బిడ్డ అని పార్టీ పెట్టి చాప చుట్టేసిన షర్మిల రెండు నెలల ముందు ఏపీకి వచ్చి ఏం చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ గాజుల శ్వేతారెడ్డి, నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షురాలు శిరోమణి, పార్టీ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరీ నాయుడు, కార్పొరేటర్ అర్షియా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ



అర్చకులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం.



సమావేశానికి హాజరైన అర్చకులు

మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు సుబుదేంద్ర తీర్థులు ఆశీస్సులతో మఠానికి చెందిన గురురాజం ఘన భవనంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో వీరశైవ ఆగమ సలహా మండలి సభ్యులు శశిభూషణ సిద్ధాంతి చేత వీరశైవ ఆగమనం గురించి అర్చకులకు వివరించారు. వెంకటేశ్వర యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ఎస్ రాజేష్ పాంచరాత్రి ఆగమనం గురించి వివరించారు. కార్యక్రమానికి మఠం మేనేజర్ శ్రీనివాస రావు, ట్రెనింగ్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.తనూజ్ విష్ణువర్ధన్, జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధి సూర్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అర్చకులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 300 మంది అర్చకులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయము, ఆదోని

Roc.No. AGC-05-12/2/2019-MRKT RFMS-RTG, Dt. 06-08-2023

టెండరు నోటీసు

వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆదోని మార్కెట్ యార్డు నందు స్థాపించియున్న మల్టీ కమోడిటి గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ మిషన్‌ను నిర్వహణ అనుభవం కల్గి ఉండి, సాంకేతిక అనుభవం కల్గి ఉన్న వారి నుండి నెలసరి అద్దె ప్రాతిపదికన సీల్డ్ టెండర్లను ఆహ్వానించడమైనది.

టెండరు షెడ్యూలు జారీ తేదీ	తేది:12-02-2024 నుండి 14-02-2024 సాయంత్రము 5.00 గంటల వరకు
టెండరు దాఖలు తేది	తేది 15-02-2024 ఉదయము 10.30 గంటలలోపు
టెండరు తెరచు తేది	తేది 15-02-2024 ఉదయం 11-00 గంటలకు

సూచిక: మరిన్ని వివరాలకై వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆదోని కార్యాలయము నందు పనిదినములలో సంప్రదించగలరు.

సం/- ఎంపిక శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆదోని

ఆకతాయిలకు జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): ఆకతాయిలకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించారు. కోర్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని షాదిక్‌నగర్‌కు చెందిన ఆకతాయిలు షాదిక్‌హుసేన్, షాజీద్‌లు గాంధీచౌక్‌లో పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటూ కేకలు వేస్తూ ఈలలు వేస్తూ, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ప్రజాశాంతికి భంగం కలిగించారు. అక్కడి స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అరెస్ట్ చేశారు. కోర్టులో జడ్జి ఎదుట హాజరుపరుచగా ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు పోలీస్ సిబ్బంది తెలిపారు.

విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు కావాలి

- ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ వీఎన్ బాబు



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ వీఎన్ బాబు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు చేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్(ఫైనాన్స్) వీఎన్ బాబు ఆదేశించారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్ గవర్నమెంట్ బిల్లుల వసూలు సంతృప్తికరంగా ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, నీటిపారుదల తదితర విద్యుత్ బిల్లుల వసూలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హంద్రీనీవా విద్యుత్ బిల్లులు రూ.2,500 కోట్లు, గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.6 కోట్లు, అగ్రికల్చర్ అరియర్స్ రూ.1.50 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి బిల్లులు రాబట్టాలన్నారు. దశల వారీగా బిల్లులు రాబట్టినా ఏపీఎస్‌పీడీసీఎల్‌కు కలిసి వస్తుందన్నారు. కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లాయర్లతో సంప్రదించి కౌంటర్లు వేయాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రవికుమార్, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో ఇంటర్ లింకింగ్ సబ్‌స్టేషన్‌లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.40 కోట్ల వ్యయంతో ఐదు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లు, 263 కిలోమీటర్ల పొడవున 33 కేవీ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హడ్కో నిధులతో నిర్మించే సబ్ స్టేషన్‌లు, విద్యుత్ లైన్‌ల నిర్మాణాలకు ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. ఇంటర్ లింకింగ్ సదుపాయంతో వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కర్నూలు టౌన్, కర్నూలు రూరల్, డోన్ డివిజన్‌లలో రూ.20 కోట్ల వ్యయం 2 విద్యుత్ 33 కేవీ సబ్ స్టేషన్‌లు, 33 కేవీ లైన్‌లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రూ.9 కోట్లతో ఆదోని, రూ.11 కోట్లతో నంద్యాల డివిజన్‌లతో మూడు సబ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్యాపిలి మండలం గార్లదిన్నె, డోన్ మండలం తిమ్మాపురం, బండి ఆత్మకూరు మండలం వడ్లరామాపురం, మంత్రాలయం మండలం సూగూరు, రుద్రవరం మండలం ఆర్.నాగులాపురం గ్రామాల్లో 33 కేవీ సబ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నట్లు ఎస్ఈ పేర్కొన్నారు. హడ్కో నిధులతో 5 సబ్ స్టేషన్‌లు, 263 కిలోమీటర్ల మేర 33 కేవీ లైన్ అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. రిజర్వాయర్‌లో 0.378 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లుపేర్కొన్నారు.

క్షణికావేశంలో నేరాలకు పాల్పడొద్దు



ఆదోనిలో మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాస్‌రావు

ఆదోని రూరల్/పత్తికొండటౌన్: క్షణికావేశంలో నేరాలకు పాల్పడవద్దని న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం ఆదోని, పత్తికొండ సబ్ జైళ్లను ఆయన తనిఖీ చేశారు. సబ్ జైళ్లలో న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో 'న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులు' నిర్వహించారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉండి బెయిల్‌కు షూరిటీ ఇవ్వలేని ఖైదీలకు కేంద్ర ప్రభుత్వమే షూరిటీ ఇస్తుందన్నారు. అనంతరం జైళ్లను పరిశీలించి, రిమాండ్ ఖైదీలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. పత్తికొండలో ఇంటిగ్రేటెడ్ బాలుర హస్టల్, ఆంజనేయనగర్‌లో ఉన్న బీసీ బాలుర కళాశాల హస్టల్‌ను జడ్జి తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో ఆదోని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ శ్రీవల్లి, సబ్‌జైల్ సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, పత్తికొండ సబ్‌జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించండి

- పాణ్యం నియోజకవర్గ ఈఆర్ఓ/జేసీ నారపురెడ్డి మౌర్య





హాజరైన అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లోమౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పాణ్యం నియోజకవర్గ ఈఆర్ఓ/జేసీ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా వచ్చిన తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నిరంతర విద్యుత్, నీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు కచ్చితంగా ఉండాలన్నారు. ఎక్కడ ఏ వసతి లేకపోయినా తన దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని సమస్యలను ఆమె దృష్టికి తీసుకు రాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు, గడివేముల తహసీల్దార్లు ఫణికుమార్, నటరాజు, మునివేలు, గురునాథ్, ఎన్నికల విభాగం డీటీ అనురాధ, బీజేపీ నుంచి రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నుంచి యశ్వంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నుంచి అక్కిమి అనుమంతరెడ్డి, సీపీఐ నుంచి శ్రీనివాస రావు, బీఎస్పీ నుంచి చిరంజీవి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ REGULAR/DISTANCE/ONESITTING/ DISCONTINUED/FAILURES/DETAINED: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, BBA, BCA, BED, MPED, LLB, MPHW, MBA, MCA, AGBSC, PHD. GOVT & PRIVATE JOBS ELIGIBLE : Cell: 8686172989. [L-806363]

■ **One Sitting:** 10th/Inter (NIOS), MPC, BIPC, M'BIPC, CEC, HEC, కేవలం 5 పేపర్లు మాత్రమే authorised study centre, Sugan College, Near: Apsara Circle, Kadapa ✆ 9949393809, 8328358047, 9704040276 [C-777499]

DISTANCE DEGREE & PG

■ **Degree : B.Com** - CA, BBA, BA, BCA, B.Sc, B.Com BLISc, PG, MA, MBA, MCA, MSC, M.Com MSW, MLISc. Sri Vijayadurga Degree College, Kurnool : Contact: **90306 28410, 93937 28410.** [L-806357]

REAL ESTATE

PLOT FOR SALE

■ వేగంగా అభివృద్ధి అవుతున్న కర్నూలు-నందికొట్కూరు మెయిన్ రోడ్డులో కుడ అప్రూవుడ్‌తో నంద్యాల చెక్‌పోస్ట్‌కు 4 కి.మీ. దూరంలో ఓపెన్ ప్లాట్లు బ్యాంక్ లోన్‌తో కలవు. సెల్: 9533049765. [L-822352]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6391]

BUSINESS OFFER

■ **Sri Avani Eco-Life Pvt Ltd.** తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ' బయోడిగ్రేడబుల్' కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా డీలర్లు కావలెను. ఫోన్: 9493786468, 6301041696. [H-801665]

AGRI BUSINESS

■ మిర్చిరైతులకు శుభవార్త: ఇప్పుడు మన ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటిసారిగా పండుమిరప కాయలను ఎండపెట్టగల అత్యాధునిక టెక్నాలజీతో ఎలక్ట్రికల్ డ్రైయరు కలదు. వివరాలకు సంప్ర: 9841024816 [G-824410]

WANTED

■ కర్నూలులో బ్యాంకింగ్ సెక్టర్‌లో పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ వెంటనే కావలెను. జీతం: 8,000/-+ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సం.ప్ర: 99517 69469. [L-822353]

■ డోన్ KVS హాస్పిటల్ నందు పనిచేయుటకు డ్యూటీ డాక్టర్స్ MBBS, BUMS, BHMS, BAMS (M/F) కావలెను. & మెడికల్ షాపులో పనిచేయుటకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు కావలెను. సెల్: 9533119937(డాక్టర్), PRO: 9966376749. [L-806370]

■ శ్రీ శక్తి మ్యాక్స్ లి॥ నందు పని చేయుటకు ఆఫీస్ స్టాఫ్ M/F కావలెను. అర్హత: డిగ్రీ. సం.ప్ర: 4th ఫ్లోర్ ఐకాన్ షాపింగ్ మాల్, బిర్లా కాంపౌండ్, కర్నూలు. సెల్: 8341380122, 9502766466. [L-806371]

■ మీ జిల్లా అంతటా మండలాల వారిగా ప్రభుత్వ సంస్థలలో అవుట్ సోర్సింగ్ జాబ్స్ కలవు. Qul: SSC to Degree, A: 18 to 40, Sal: 15,000 to 28,000. 98851 22226. [T-4897]

■ ఉచితంగా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఎలక్ట్రీషియన్ & బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ కోర్సును నేర్పించి ఉద్యోగం చూపించబడును. ఉచిత వసతి+భోజనం. వ:18-35సం॥, గుంటూరు. ✆ 9133444985/ 89 [G-824404]

■ జాబ్ గ్యారంటీ జీతం: 18-30 వేల వరకు, ఫ్రీరూం+భోజనం ఇచ్చి మహిళలు/పురుషులకు జాబ్స్. ఏజెంట్లు కావలెను. (1 మనిషికి 5000/- కమీషన్). ఫోన్: 8886733009. [HA-10848]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000, ఫ్రీ రూం+భోజనం HYD. PH: 7995984445. [HA-1188]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

